డ్రగ్గిస్టులకు అడ్డా
టూరిజం బిల్డింగ్





అసంపూర్తిగా ఉన్న పర్యాటక భవనం



గంజాయి బ్యాచ్‌లకు అనువుగా ఉన్న భవనంలోని గదులు



భవనంలోని గదుల్లో విచ్చలవిడిగా పడివున్న వాడేసిన సిరంజిలు

తిరుపతిలోని ఎస్వీఆర్ రుయా ఆస్పత్రికి ఎదురుగా అసంపూర్తి నిర్మాణంగా మిగిలిపోయిన టూరిజం భవనం డ్రగ్గిస్టులు, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారుతోంది. గత పదేళ్లుగా ఇది మొండిగోడలకే పరిమితం అయ్యింది. నిర్మాణం పూర్తయి గదులు, గదులుగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అనువైన వేదికగా మారింది. గంజాయి, డ్రగ్స్‌కి అలవాటు పడినవారు అక్కడకి చేరిపోతున్నారు. పోలీసుల నిఘా లేకపోవడం వీరికి వరంగా మారింది. రెండు రోజుల కిందట అటువైపునుంచి మత్తులో తూలుతూ బైక్‌పై వచ్చిన ముగ్గురు తమ వాహనంతో మరో బైక్‌ను ఢీకొట్టారు. ఈఘటనలో రిటైర్డ్ అధికారి డాక్టర్ ఎన్.ధర్మయ్యకు తొడ ఎముక విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనవెంట ఉన్న సాహితీవేత్త సాకం నాగరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితుల ఫిర్యాదుమేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మెడికల్ కాలేజీకి సమీపంలో ఉన్న ఈ భవనం ప్రమాద సంకేతంగా కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రేపు పంచమి తీర్థం

తిరుచానూరులో చక్రస్నానానికి సర్వంసిద్ధం

నేటి రాత్రి నుంచి గ్రామంలోకి వాహనాలకు నో ఎంట్రీ



తిరుచానూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు... ప్రధాన ఘట్టమైన పంచమి తీర్థానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. చక్రస్నానం కోసం కొత్త నీటితో పుష్కరిణి సిద్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటలకు అభిజిత్ లగ్నంలో పద్మ సరోవరం (పుష్కరిణి)లో చక్రస్నానం నిర్వహిస్తారు. పురాణాల ప్రకారం.. తనపతి అయిన శ్రీహరి తపస్సుకు మెచ్చి పద్మావతి అమ్మవారు పద్మసరోవరంలో బంగారు పద్మంపై కార్తీకమాసం శుక్లపక్షం పంచమి తిథి ఉత్తరాషాఢ నక్షత్రం మంత్ర ముహూర్తంలో ఆవిర్భవించింది. అలాంటి పవిత్ర ఘడియలున్న పంచమితీర్థం రోజున పుష్కరిణిలో స్నానమాచరిస్తే అమ్మవారు సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం. అందుకే ఏటా పంచమితీర్థానికి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. ఒకసారి 30వేల మంది పుష్కరిణిలో స్నానాలు ఆచరించవచ్చని విజిలెన్స్ అధికారులు తెలిపారు. పుష్కరిణిలో తోపులాటలు జరగకుండా టీటీడీ విజిలెన్స్ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

హోల్డింగ్ పాయింట్ల నుంచే పుష్కరిణిలోకి

తిరుచానూరులో మూడు చోట్ల జర్మన్‌షెడ్లతో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్ల నుంచే భక్తులు ఎవరైనా అమ్మవారి పుష్కరిణిలోకి వెళ్లాలి. పుత్తూరు వైపు నుంచి వచ్చే భక్తులకు గోశాల, జడ్పీ హైస్కూల్.. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట వైపు నుంచి వచ్చే భక్తులకు నవజీవన్ ఆస్పత్రి వద్ద హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ మూడు చోట్ల నుంచి విడతలవారీగా ప్రత్యేక క్యూలైన్ ద్వారా పాత పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న గేట్ నెంబరు 4 నుంచి పుష్కరిణిలోకి అనుమతిస్తారు. పుష్కరిణిలో స్నానాలు పూర్తి చేసుకున్న భక్తులను గేటు నెంబరు 5 గుండా ఘంటసాల విగ్రహంవైపు, గేటు 6 నుంచి సమాజంవీధి గుండా తోలప్ప గార్డెన్‌వైపు మళ్లిస్తారు. గేట్ నెంబరు 3 నుంచి భక్తులు వెలుపలకు వెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు భక్తులను పుష్కరిణిలోకి అనుమతిస్తామని అధికారులు తెలిపారు. పుష్కరిణిలోకి వెళ్లి.. రావడానికి 28 గేట్లు ఉన్నాయి. అందులో పసుపు మండపం వద్దనున్న మూడింటిని వీవీపీలు, అమ్మవారి ఉత్సవమూర్తి రావడానికి వినియోగిస్తారు. టీటీడీ ఉద్యోగులను గేటు నెంబరు మూడు నుంచి అనుమతిస్తారు.

లక్ష మందికి అన్నప్రసాదాలు

లక్షమందికిపైగా అన్నప్రసాదాలు అందించేందుకు 120 ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం వెజిటబుల్ ఉప్మా, పొంగల్‌తోపాటూ బాదంపాలు అందజేస్తారు. మధ్యాహ్నం పులిహోర, దద్దోజనం, చక్కెర పొంగలి, కదంబం ఇవ్వనున్నారు. లక్షన్నర నీళ్ల బాటిళ్లను సిద్ధం చేశారు. గురువారం రాత్రికే పెద్ద ఎత్తున చేరుకునే తమిళనాడు భక్తులను హోల్డింగ్ పాయింట్లకు తరలించి అన్నప్రసాదాలు అందజేస్తారు.

పార్కింగ్ ప్రదేశాలివే

గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు తిరుచానూరులోకి ఎటువంటి వాహనాలను అనుమతించరు. భక్తుల వాహనాలు మినహా మిగిలిన వాటిని దారి మళ్లించనున్నారు. తిరుపతి నుంచి వచ్చే భక్తుల వాహనాలకు మార్కెట్ యార్డు, శిల్పారామం.. చంద్రగిరి వైపు నుంచి వచ్చే వాటికి తనపల్లె వెళ్లే 150 బైపాస్ రోడ్డు, రామానాయుడు కల్యాణ మండపం.. రేణిగుంట వైపు నుంచి వచ్చే వాటికి తిరుచానూరు దళితవాడ వద్ద.. పుత్తూరు నుంచి వచ్చే వాహనాలకు ముండ్లపూడి క్రాస్ సమీపంలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి భక్తులు హోర్డింగ్ పాయింట్లకు నడిచి వెళ్లాలి.



భక్తులకోసం సిద్ధమైన హోల్డింగ్ పాయింట్



260 మొబైల్ మరుగుదొడ్లు

తాత్కాలికంగా 260కిపైగా మొబైల్ టాయిలెట్లను టీటీడీ ఏర్పాటు చేసింది. అంబులెన్స్, వైద్యులు, ప్రథమ చికిత్స కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణకు వందలాది మందిని కేటాయించారు.

1600 మందితో బందోబస్తు: ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచమి తీర్థానికి 1600 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. తిరుచానూరులో బుధవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. భక్తులందరూ పుష్కరిణిలో స్నానాలు ఆచరించేలా విడతల వారీగా పుష్కరిణిలోకి అనుమతించాలని సూచించారు. చిన్న దొంగతనాలు, తొక్కిసలాట, తోపులాటలకు తావులేకుండా పనిచేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తిరుచానూరు చుట్టుపక్కల రోడ్లు ఎంత క్లియర్‌గా వుంటే వాహనాల రాకపోకలకు అంత సులువుగా ఉంటుందన్నారు. భక్తులను తనిఖీ చేశాక హోల్డింగ్ పాయింట్లలోకి అనుమతించాలన్నారు. పుష్కరిణిలో స్నానమాచరించే సమయంలో ఎవరైనా అకతాయిలు వెకిలి చేష్టలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, రామకృష్ణ, చిత్తూరు రిజర్వు అదనపు ఎస్పీ నందకిషోర్‌కుమార్, వీజీవో రాంకుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. పోలీసులతో పాటు 400 మంది టీటీడీ భద్రతా సిబ్బంది, 200 మందిస్కౌట్లు, 200 మంది శ్రీవారి సేవకులను టీటీడీ ఏర్పాటు చేసింది. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

జాబిల్లిపై సిరుల తల్లి



శోభాయమానంగా చంద్రప్రభ వాహనసేవ

పదునారు కళలతో ప్రకాశించే చంద్రప్రభనే వాహనంగా చేసుకుని ఊరేగుతున్న పద్మావతమ్మ వైభవాన్ని బుధవారం రాత్రి భక్తజనం తన్మయంగా వీక్షించారు. మంగళవాయిద్యాలు, చిన్నారుల కోలాటం, భజన బృందాల ఆటపాటలూ, కళాకారుల నృత్య ప్రదర్శన, భక్తుల గోవిందనామస్మరణల నడుమ తిరుచానూరు మాడవీధుల్లో చంద్రప్రభ వాహనసేవ వేడుకగా సాగింది.

రథోత్సవానికి సర్వం సిద్ధం

బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన గురువారం ఉదయం 8 గంటలకు రథోత్సవం జరగనున్నది. రథం సులువుగా తిరిగేందుకు వీలుగా తిరుమాడవీధుల్లో ఇసుక పరిచారు. మాడవీధుల్లో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. పటిష్ఠ భద్రత కోసం పోలీసులను అధిక సంఖ్యలో నియమించారు.





- మరిన్ని బ్రహ్మోత్సవ విశేషాలు 8లో -

చిచ్చు రేపిన సినీ- పొలిటికల్ ఫ్లెక్సీ

- పుష్ప-2 ఫ్లెక్సీలో వైసీపీ నేతల ఫొటోలు, రాజకీయ కామెంట్లు
- చింపేసిన టీడీపీ వర్గీయులపై రాళ్ల దాడి
- గంటన్నర పాటు ఉద్రిక్తత



పాకాలలో మోహరించిన వైసీపీ, టీడీపీ వర్గీయులు - (ఇన్‌సెట్‌లో)వివాదానికి కారణమైన ఫ్లెక్సీ

పాకాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాకాలలో సినీ-పొలిటికల్ ఫ్లెక్సీ వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ చిచ్చు రేపింది. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సినిమా థియేటర్‌లో బుధవారం పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా అల్లు అర్జున్ అభిమానులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు పెట్టారు. వైసీపీ నేత మునీర్ కుమారుడు అఫ్రీద్ కూడా అల్లు అర్జున్‌తో పాటు మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీ పెట్టారు. 'మంచి చేసి మోసపోయిన ఎమ్మెల్యే తాలూకా... 2029 సీఎం తాలూకా.. తగ్గేదే లే..' అంటూ కామెంట్స్ కూడా జోడించారు. సినీ ఫ్లెక్సీల్లో నేతల ఫొటోలు, వ్యాఖ్యలపై టీడీపీ మద్దతుదారులు అభ్యంతరం తెలిపారు. తొలగించాలని పట్టుబట్టడంతో ఇరువర్గాల నడుమ వివాదం తలెత్తింది. ఫ్లెక్సీ తొలగింపునకు అంగీకరించకపోవడంతో టీడీపీ వర్గీయులు చించేశారు. దీంతో వైసీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. అదే సమయంలో వైసీపీకి చెందిన వారు కర్రలతో భారీగా చేరుకున్నారు. టీడీపీ వర్గీయులూ రావడంతో ఇరువర్గాలూ వాగ్వాదానికి, తోపులాటకూ దిగాయి. ఈ క్రమంలో ఓ టీ స్టాల్ పాక్షికంగా ధ్వంసమైంది. ఈ గొడవతో తిరుపతి- దామలచెరువు మెయిన్ రోడ్డులో గంటన్నర పాటు ట్రాఫిక్ స్తంభించింది. డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి పోలీసు బలగాలతో చేరుకుని ఇరువర్గాలనూ చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాజకీయ నేతల ఫొటోలు, కామెంట్లతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వైసీపీ వారే రెచ్చగొట్టారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ప్రాంతంలోనూ ఆ పార్టీ మద్దతుదారులు కొందరు రౌడీయిజం చెలాయిస్తుంటారని, దుకాణాల్లో తిష్ట వేసి మహిళల పట్ల వెకిలి చేష్టలకు పాల్పడుతుంటారన్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ ఘర్షణకు సంబంధించి వైసీపీ వర్గీయుల తమపై రాళ్లు, కర్రలు, వేడినీటితో దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. శాంతి భద్రతల సమస్య కారణంగా ఘటనా స్థలి సమీపంలో.. రోడ్డు పక్కన ఉన్న వైసీపీ మద్దతుదారుడి టీ దుకాణాన్ని రాత్రి డీఎస్పీ ప్రసాద్, తహసీల్దారు నిత్యానందబాబు, ఎంపీడీవో శశిరేఖ, పంచాయతీ సిబ్బందితో తొలగించారు.

7న ప్రభుత్వ బడుల్లో 'చదువుల పండుగ'

మెగా పేరెంట్స్ మీటింగ్‌కు రూ.42.79 లక్షలు విడుదల

తిరుపతి(విద్య), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏడో తేదీన 'చదువుల పండుగ' నిర్వహించనున్నారు. ఈ మెగా పేరెంట్స్ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.42.79 లక్షలు విడుదల చేసింది. మొత్తం 2,322 ప్రభుత్వ పాఠశాలల్లో 1.56 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యనుబట్టి ఆయా పాఠశాలలకు నిధులు కేటాయిస్తారు. 10 మంది లోపుంటే రూ. 1000, 101 నుంచి 200 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ. 3 వేలు, 301 నుంచి 400 మంది ఉన్న పాఠశాలలకు రూ. 6వేలు ఇలా అత్యధికంగా 901 నుంచి 1000 మంది ఉన్న పాఠశాలలకు రూ. 11 వేల చొప్పున కేటాయించారు. ఈ మీటింగు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి విద్యాపరమైన అంశాలు చర్చించనున్నారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారు? ఏ పాఠ్యాంశంలో వెనుకబడి ఉన్నారు? ఎన్నెన్ని మార్కులు వస్తున్నాయనేది అక్కడికక్కడే తల్లిదండ్రులు తెలుసుకునే వీలు కలుగుతుంది. ఇలా జిల్లాలోని 1.56 లక్షల విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందించనున్నారు. దీనివల్ల విద్యార్థుల చదువు, ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టిపెట్టి సరిదిద్దేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. పిల్లల చదువులపై వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు జవాబుదారీతనం పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని డీఈవో కేవీఎన్ కుమార్ చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలకోసం తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయులు.. ఉపాధ్యాయుల నుంచి తల్లిదండ్రులు ఎలాంటి సహకారం కోరుకుంటున్నారనేది తెలుసుకోవచ్చని ఈ కార్యక్రమ నోడల్ అధికారి జి.సురేష్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయమే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

రామచంద్రాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించేలా ప్రతిఒక్కరూ పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాల యంలో గ్రామ సమాఖ్య సభ్యులు, మండల మహిళా సమాఖ్య పాలక సభ్యులు, బుక్ కీపర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి, ఆదాయాన్ని పొందొచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే ఆహార ధాన్యాలు, కూరగాయలను తినడంతో మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. మహిళా సంఘాలతో ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో డీపీఎం షణ్ముగం, ఎస్‌ఆర్‌పీ భానుమూర్తి, ఏటీఎం గురుమూర్తి, బీపీఎం దూర్వాసులునాయుడు, మోడల్ టీఎల్ విమల, మధు, కమ్యూనిటి కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఆర్జేడీ శామ్యూల్



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ శామ్యూల్

రామచంద్రాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయ వంతంగా నిర్వహించాలని ఉపా ధ్యాయులను ఆర్జేడీ శామ్యూల్ సూచించారు. బుధవారం కేకేవీ పురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీటింగ్ ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఆర్జేడీ మాట్లాడుతూ మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్‌లో విద్యార్థుల ప్రగతిని వివరించాలన్నారు. అలాగే ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న సమ్మేటివ్ అసైన్‌మెంట్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని.. మెరుగైన ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగాలమ్మను దర్శించుకున్న మహిందర్‌రెడ్డి



బొంగునూరు మహింధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

చంద్రగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి జాతీయ రహదారిలోని నాగాలమ్మను బుధవారం టీటీడీ పాలకమండలి సభ్యులు బొంగునూరు మహిందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు శివరామ్‌శర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. దర్శనానంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి మహింధర్‌రెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఒంటి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎక్స్ కార్నర్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో లలితకుమారి

చంద్రగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎక్స్ కార్నర్ ల్యాబ్‌ను బుధవారం ఎంఈవో లలిత కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ గత రెండేళ్లుగా షెల్ ఇండియా సహకారంతో స్మైల్ ఫౌండేషన్ తిరుపతి జిల్లాలో 38 పాఠశాలలకు ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పిస్తూ స్టెమ్ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీంతో విద్యార్థులకు సైన్స్ ప్రాజెక్టుపై అవగాహన పెరిగి నూతన ఆలోచనా విధానాలతో కొత్తగా ప్రాజెక్టులు తయారు చేయడానికి దోహదపడుతుందన్నారు. అందులో భాగంగానే చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో రూ.2 లక్షల విలువైన స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఇన్వెర్టర్, సైన్స్ ప్రాజెక్టులు, మెటీరియల్, కార్నర్ పెయింటింగ్ అందించారని తెలిపారు. విద్యార్థులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకొని సైన్సులో నూతన విధానాలతో కూడిన ప్రాజెక్టులు తయారు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధులు లోకేశ్వరి, రఫీ, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై సర్వే



చంద్రగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలోని ఆరో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షలు నిర్వ హించారు. పరాక్ రాష్ట్రీయ సర్వేక్షణ్‌లో (జాతీయ స్థాయి సర్వే) భాగంగా రాష్ట్ర స్థాయిలో చంద్రగిరి మండలంలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షలకు నోడల్ అధికారులుగా ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌గా శారద, అబ్జర్వర్‌గా అనుప్రియ వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వానలోనే వాహన సేవ



తిరుచానూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి చంద్రప్రభ వాహనంలో దర్బారు కృష్ణుడు అలంకారంలో అమ్మవారు తిరుమాడ వీధుల్లో ఊరేగారు. రాత్రి 7 గంటలకు వాహనసేవ తిరుమాడవీధుల్లో ప్రారంభమైంది. వాహన మండపం దాటిన తర్వాత భారీ వర్షం మొదలైంది. వాహన సేవ ముగిసే వరకు వర్షం కురుస్తుండటంతో ఘటాటోపం నీడన వాహన సేవ జరిగింది. భారీ వర్షానికి తిరుమాడ వీధుల్లో భక్తులు పెద్దసంఖ్యలో రాకపోవడంతో సరిగ్గా 9 గంటలకు అమ్మవారికి వాహనసేవ ముగిసింది. ఏకధాటిగా రెండు గంటల పాటు వర్షం కురవడంతో భక్తులు, కళాకారులు తడిసి ముద్దయ్యారు.















మాయమాటలతో పట్టపగలే చోరీ



మోసపోయిన శంకర్‌నాయుడు

పాకాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండరు వచ్చిందంటూ వీధి చివర గ్యాస్ బండి డ్రైవర్ రమ్మంటున్నారని వృద్ధుడిని ఇంట్లో నుంచి బయటికి పంపి చోరీకి పాల్పడిన ఘటన పాకాల రామయ్యనాయుడు కాలనీలో బుధవారం ఉదయం జరిగింది. రామయ్యనాయుడు కాలనీలో ఆలం శంకర్‌నాయుడు నివాసముంటున్నారు. భార్య ఉదయం ఆసుపత్రికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న శంకర్‌నాయుడు వద్దకు సుమారు 40 ఏళ్లకు పైగా వయసు ఉన్న ఓ వ్యక్తి వచ్చాడు. ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకోవడానికి గ్యాస్ బండి డ్రైవర్ రమ్మంటున్నాడని చెప్పడంతో శంకర్ నాయుడు బీరువా తీసి రూ.వెయ్యి తీసుకొని గ్యాస్ కోసం బండి వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో దుండగుడు ఇంట్లో చొరబడి బీరువాలోని ఒకటిన్నర సవరం బంగారు గాజులు, రెండున్నర సవరాల నల్లపూసల గొలుసు, వెండితోపాటు రూ.40 వేల నగదు, బ్యాంకు పాసు పుస్తకాలు, ఏటీఎం కార్డులు చోరీ చేశాడు. వీధి చివరలో గ్యాస్ బండి లేకపోవడంతో తిరిగి ఇంటికి వచ్చిన శంకర్‌నాయుడుకు బీరువా తలుపులు తీసి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టపగలే చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదిరోజుల క్రితం పాకాల భారతం మిట్టలో ఓ వృద్ధురాలి నుంచి బంగారు గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. వరుస చోరీలతో స్థానికులు భయపడుతున్నారు.

గుంతల రోడ్డుపై అదుపుతప్పిన సిలిండర్ లారీ

- డ్రైవర్ చాకచక్యంతో తప్పిన పెను ప్రమాదం

ఎర్రావారిపాలెం, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): గుంతల రోడ్డుపై సిలిండర్ లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పడంతో బోల్తా పడబోయి డ్రైవర్ చాకచక్యంతో పెను ప్రమాదం తప్పింది. స్థానిక తలకోన రోడ్డులోని సంత నుంచి బేరిపల్లికి వెళ్లే రోడ్డు దుస్థితిలో ఉంది. మోకాల్లోతు గుంతలతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డుకు రూ.10 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం మంజూరైంది. దీంతో 90 శాతం తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రోడ్డుకు వెళ్లే భూ యజమానుల్లో ఒకరు అభ్యంతరం చెప్పడంతో 200 మీటర్ల దూరం ఉన్న రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. రోడ్డు పక్కనే ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ ఉంది. కడప నుంచి సిలిండర్ లోడుతో వచ్చిన లారీ బుధవారం సాయంత్రం గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ వద్దకు వెళుతూ రోడ్డు మధ్యలో ఇరుక్కుపోయి పక్కకు ఒరిగిపోయింది. డ్రైవర్ చాకచక్యంతో లారీతో బయటపడ్డాడు. దీంతో లారీ రాకపోకలకు తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తహశీల్దారు పరమేశ్వరస్వామికి వినతి పత్రం అందించారు.

మద్యం దుకాణం ముందు రహదారిపైనే పార్కింగ్



మద్యం షాపు ముందు రోడ్డుపైనే ఆటో, ద్విచక్ర వాహనాలను పార్క్ చేసిన దృశ్యం

తిరుపతిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతీ పరిధిలోని ఉప్పరపల్లె సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ముందు రహదారిపై పొద్దు గూకితే మందుబాబులు ఆటోలు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి ఉండడంతో అటువైపుగా వెళ్లే వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడుతోంది. ఈ మద్యం దుకాణానికి సమీపంలోనే రెండు ప్రైవేట్ బాలికల జూనియర్ కళాశాలలు, వాటికి అనుబంధ వసతిగృహాలు నడుస్తుండడంతో పాటు దీన్ని ఆనుకునే పద్మావతి మహిళా వర్సిటీ కూడా ఉంది. మరోపక్క మల్లంగుంట పంచాయతీలో వినాయకనగర్ నుంచి ఉప్పరపల్లె మీదుగా మహిళా వర్సిటీకి చేరుకునే రహదారిని వీఐపీ మార్గంగా పిలుస్తారు. తిరుపతి పర్యటనకు తరచూ వీఐపీలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి కీలకమైన రహదారిలో రెండు మద్యం షాపులకు అనుమతి ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాలికల జూనియర్ కళాశాలలకు అతి సమీపంలో మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వడమేమిటని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కాగా గతంలో ఈ స్థలంలో మద్యం షాపు ఏర్పాటు చేయరాదని అప్పటి కలెక్టర్లు(సిద్ధార్థజైన్, ప్రద్యుమ్న)లైసెన్స్‌లను కూడా రద్దు చేశారని గుర్తు చేస్తున్నారు.

తిరుమలలో టీటీడీ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు



తిరుమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం తిరుమలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. వరాహ స్వామి విశ్రాంతి భవనం వద్దనున్న దుకాణాలు, హాకర్ లైసెన్సులను స్వయంగా పరిశీలించారు. ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దుకాణదారులు తమకు కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణలు చేసి భక్తులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వీఎస్వో సురేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



నగదు, దుస్తులు అందిస్తున్న కరుణాకరరెడ్డి

తిరుపతి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుమ్మలగుంట గ్రామ పంచాయతీ పరిధిలో ఉప్పరపల్లెకి చెందిన టీడీపీ కార్యకర్త మునిభాస్కర్ కుటుంబానికి గ్రామానికి చెందిన ఆ పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకరరెడ్డి బుధవారం ఆర్థికసాయం అందించారు. మునిభాస్కర్ కుమార్తె వివాహానికి పార్టీ తరపున రూ.25వేల నగదు, దుస్తులు అందజేశారు. కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ తుమ్మలగుంటలో టీడీపీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ వంతెనపై ప్రయాణం నరకమే..!

గుంతలమయంగా తాత్కాలిక వంతెన



చిగురువాడ వద్ద తాత్కాలిక వంతెనపై ఏర్పడిన గుంతలు

తిరుపతి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చిగురువాడ వద్ద స్వర్ణముఖి నదిపై వంతెన మూడేళ్ల క్రితం కురిసిన వర్షానికి కొట్టుకుపోయి గుంతలమయంగా తయారైంది. అప్పటి వైసీపీ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించకుండా స్వర్ణముఖి కాలువపై దెబ్బతిన్న వంతెన కింద సిమెంటుపైపులు ఏర్పాటు చేసి దానిపై బీటీ రహదారిని నిర్మించి తాత్కాలిక పనులతో సరిపెట్టేశారు. ఇప్పుడు ఈ తాత్కాలిక వంతెన రహదారిపై సిమెంటు, కంకరతేలిపోయి గుంతలు ఏర్పడి ప్రమాదంగా తయారైంది. వంతెనపై ప్రారంభం నుంచి చివరి వరకు పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. 150 బైపాస్ రోడ్డు సర్కిల్ నుంచి ఆర్‌సీపురం మీదుగా పచ్చికాపల్లం వైపునకు వెళ్లే ఈ మార్గంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. తిరుపతిలోని విద్యాసంస్థలకు విద్యార్థులను తరలించే వాహనాలు, శ్రీవారి దర్శనానికి వచ్చే యాత్రికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా ఈ వంతెనపై శాశ్వత పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద విశ్వేషతీర్థ స్వామి

తిరుమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి, ఉడిపి పెజావార్ మఠాధిపతి విశ్వేషతీర్థ స్వామిజీ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం మంత్రి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన అందించే శక్తిని సీఎం చంద్రబాబుకు ప్రసాదించాలని, రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలని శ్రీవారిని ప్రార్థించినట్టు తెలిపారు.



మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు దుర్మార్గం



నిరసన తెలుపుతున్న హిందూ ఐక్యవేదిక సంఘం నాయకులు, ప్రజలు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు దుర్మార్గపు చర్య అని తిరుపతి హిందూ ఐక్యవేదిక కన్వీనర్ వజ్రాల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం సాయంత్రం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎంఆర్‌పల్లి సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయన్నారు. పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కావాలని చేసిన పోరాటంలో భారతదేశం ఎంతో సహకరించిందన్నారు. అలాంటి మన దేశంపైనే పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులతో కలిసి కృత్రిమ ఉద్యమాలతో ప్రజాస్వామాన్ని ఖూనీ చేస్తున్నారని తెలిపారు. హిందువులు, ఇతర మైనార్టీలకు చెందిన ఆలయాలు, ఆస్తులను ధ్వంసం చేయడం సరికాదన్నారు. మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారని.. అనేక మంది పిల్లలు అనాథలవుతున్నారని తెలిపారు. ఇజ్రాయిల్-పాలస్తీనా మధ్య జరుగుతున్న దాడుల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతుగా శాంతి ప్రవచనాలు వల్లించే రాజకీయ పక్షాలు, లెఫ్ట్‌వాదులు, మానవ హక్కుల సంఘాలు ఒక మాట మాట్లాడక పోవడం శోచనీయ మన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీ.. హిందువులకు రక్షణ కల్పించాలని.. ఇస్కాన్ ధర్మా చార్యులను వెంటనే జైలు నుంచి విడిపించాలన్నారు. అక్కడి హిందువుల హక్కులు, మత విశ్వాసాలను కాపాడేలా రాష్ట్రపతి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, భరణి, ఇస్కాన్ రాధా మనోహర్‌దాస్, కీర్తి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపులో అలరిస్తున్న ఆటాపాటా

తిరుచానూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాల్లో బుధవారం సూర్యప్రభ, చంద్రప్రభ వాహనసేవల ముందు వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శించిన కళాభినయం భక్తులకు ఆధ్యాత్మికానందం కలిగించింది. 12 కళా బృందాలకు చెందిన 257 మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. బెంగళూరుకు చెందిన 15 మంది కళాకారులు ప్రదర్శించిన యక్షగానం, 25 మంది యువతులు మహాలక్ష్మిస్తుతి, భరతనాట్యం నేత్రపర్వంగా సాగింది. డప్పుతోపాటూ కోలాటం, కడప డ్రమ్స్ వేడుకలకు ఊపునిచ్చాయి.

ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వేధింపులపై ఫిర్యాదు



తిరుపతి ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

చంద్రగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన నవ్య ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది తమను వేధిస్తున్నారని చంద్రగిరికి చెందిన బాధితులు బుధ వారం తిరుపతి ఎస్పీకి, చంద్రగిరి పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఈ సందర్భంగా బాధి తులు యమున, ముని కృష్ణ, జయలక్ష్మి, సుజాత, సురేష్, అఫ్రిద్, రాజేష్‌లు మాట్లాడుతూ నవ్య ఆటో ఫైనాన్స్ వద్ద గత సెప్టెంబరులో రూ.30 వేలు చొప్పున అప్పు తీసుకున్నామని.. అయితే కొన్ని అనివార్య కారణాలతో అప్పు చెల్లించడంలో ఆలస్యమైందన్నారు. అయితే అప్పు వెంటనే చెల్లించాలని ఫైనాన్స్ కంపెనీ ఎండీ దీపారెడ్డి, అనుచరులైన సాయిప్రకాష్, సంతోష్, యుగంధర్, యమున తమను తీవ్రంగా వేధిస్తున్నారని వాపోయారు. ఫైనాన్స్ సిబ్బంది వేధింపుల నుంచి కాపాడాలని కోరారు. చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి కేసును విచారిస్తున్నారు.

వికలాంగ చట్టాలపై అవగాహన అవసరం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వికలాంగుల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన ఉన్నప్పుడే అర్హులు సద్వినియోగం చేసుకోగలరని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుమార్ మాట్లాడుతూ వికలాంగులను రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సహించి, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల ర్యాలీ నిర్వహించారు. ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన ప్రత్యేక ప్రతిభావంతులైన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, డాక్టర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా తిరుపతిలో ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఘంటసాల సర్కిల్‌లోని విగ్రహానికి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి, గాయకుడు సోము ఉమాపతి తదితరులు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ ఘంటసాల స్వరం అజరామజరం అన్నారు. పాటల రూపంలో ఆయన నేటికీ జనం మధ్య సజీవంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఘంటసాల గాన పీఠం విజయకుమార్, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, చిత్తరువు హనుమంతరావు, పురోహితుడు సురేష్, మల్లారపు రవి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, గణేష్, ప్రసాద్, సుబ్రమణ్యం, కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి అమానుషం

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 4 (ఆధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ చెంగయ్యపై భజరంగదళ్, ఏబీవీపీ నేతలు దాడి చేయడం అన్యాయమని తిరుపతి పాస్టర్స్ ఫెలోషిప్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, బహుజన, క్రైస్తవ, ముస్లిం మైనారిటీ సంఘాల నాయకులు ఖండించారు. బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప, పాస్టర్ అరుల్ అరసు, రఫీ, ధనశేఖర్, పాల్‌రాజ్, ప్రభాకర్‌లు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో చెంగయ్య మత ప్రచారం చేస్తే ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్పా భజరంగదళ్, ఏబీవీపీ నేతలు భౌతికంగా దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కృష్ణస్వామిరాజుకు సాహిత్య పురస్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు అంపశయ్య నవీన్ సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. కృష్ణస్వామిరాజు రాసిన మేకలబండ నవల ఈ పురస్కారానికి ఎంపికైనట్లు అంపశయ్య నవీన్ సాహిత్య సంస్థ కార్యదర్శి స్వప్న తెలిపారు. ఈనెల 24వ తేదీన హనుమకొండలో నిర్వహించే కార్యక్రమంలో పురస్కార ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. ఎల్ఐసీలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా రిటైర్డు అయిన కృష్ణస్వామి రాజు ఇప్పటి వరకూ 16 కథా సంపుటాలు, ఒక నవల ప్రచురించారు. కృష్ణస్వామిరాజు ఇప్పటికే తెలుగు యూనివర్సిటీ నుంచి కీర్తి పురస్కారాన్ని స్వీకరించారు. రచయిత కృష్ణస్వామి రాజును పలువురు సాహిత్యాభిమానులు, రచయితలు అభినందించారు.

శ్రీవారి సేవలో ఇస్రో బృందం

పీఎస్‌ఎల్వీ సీ 59 నమూనాకు ప్రత్యేక పూజలు



తిరుమల, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఇస్రో అధికారుల బృందం బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. శ్రీహరికోట షార్‌లో ప్రతి ప్రయోగానికీ ముందు ఇస్రో అధికారుల బృందం నమూనాతో తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పీఎస్‌ఎల్వీ సీ 59 నమూనాతో అధికారుల బృందం బుధవారం వేకువజామున సుప్రభాత సేవలో స్వామి పాదాల వద్ద నమూనాను ఉంచి ప్రత్యేక పూజలు చేయించి, శ్రీవారిని దర్శించుకుంది. బృందంలో ఎన్‌ఎస్ఐఎల్ చైర్మన్, ఎండీ డాక్టర్ రాధాకృష్ణన్, డిప్యూటీ సెక్రటరీ పద్మజ్యోతి, సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ యశోద, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసగుప్తా ఉన్నారు.

గొడుగులు రిపేరుచేసే వాళ్లున్నారు



గొడుగులున్నాయి కానీ వాటిని రిపేరు చేసేవాళ్లు కరువయ్యారు. కారణం రిపేరు కన్నా కొత్త గొడుగే నయం అనుకోవడం. ఒకప్పుడు గొడుగంటే.. దశాబ్దాలపాటు కుటుంబానికి ఉపయోగపడే వస్తువు. అపురూపంగా కాపాడుకునేవారు. ఇప్పుడు వంద పెడితే కొత్త గొడుగు వచ్చేస్తోంది. గట్టిగా గాలివీస్తే పుటుక్కున పాడైపోతోంది. పారేసి కొత్తది కొనుక్కోవడం అనే మనస్తత్వం పెరగడంతో గొడుగులను రిపేరు చేసే ఒక కళాత్మక వృత్తి దాదాపుగా అంతరించిపోయింది. 'గొడుగులు..రిపేరు చేస్తాం' అంటూ ఊళ్లలో, పట్టణాల్లో కనిపించేవారే కరువయ్యారు. గొడుగులు రిపేరు చేసేవారుండే సెంటర్లూ మాయమయ్యాయి. అయినా ఒకరో ఇద్దరో, అక్కడో ఇక్కడో తారసపడుతున్నారు. విడవకుండా వానలు కురుస్తున్న వేళ తిరుపతి నగరంలో వీరు కనిపిస్తున్నారు. 'హబ్బ.. ఎన్నాళ్లకెన్నాళ్లకూ' అనుకుంటూ కొందరు పాత గొడుగులు పట్టుకుని వీరి దగ్గరకు వస్తున్నారు. తిరుపతి అన్నారావు సర్కిల్‌లో బుధవారం గొడుగులు ముందేసుకుని దీక్షగా రిపేరు చేస్తూ కొందరు కనిపించారు. పాత జ్ఞాపకం ప్రాణం పోసుకుని కళ్లముందుకొచ్చినట్టుగా ఈ దృశ్యం కనిపించింది.



"మా సొంతూరు రొంపిచెర్ల మండలం గాండ్లచింత దగ్గరుండే దాసరి గూడెం. వంద కుటుంబాలవాళ్లం గొడుగులు రిపేర్ చేసుకుని జీవనం చేసేవాళ్లం. ఈ పని ఇప్పుడు మాకు కూడు పెట్టడం లేదు. చాలా మంది గాజులు, పూసలు అమ్ముకుంటున్నారు. వదల్లేక ఒకరిద్దరం దీన్నే పట్టుకుని ఊళ్లు తిరుగుతున్నాం. గొడుగులకు కావాల్సిన పుల్లలు, గుడ్డలు, కట్టెలు అమ్మే తావులే ఇప్పుడు లేవు. పాత గొడుగుల నుంచి కమ్మీలు, కడ్డీలను సేకరించి రిపేర్లకు వాడుకుంటున్నాం. బటన్ గొడుగులు వచ్చాక గట్టి గొడుగులకు కాలం చెల్లిపోయింది."

- మస్తాన్, గొడుగులు రిపేర్ చేసే వ్యక్తి

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ప్రశాంతంగా రైల్వే గుర్తింపు సంఘాల ఎన్నికలు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, రేణిగుంట, పాకాల, శ్రీకాళహస్తి, వెంకటగిరి రైల్వేస్టేషన్లలో బుధవారం రైల్వే ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. పోలింగ్ అధికారులు ఓటర్ల పీఎఫ్ నంబరును ఆన్‌లైన్‌లో పరిశీలించిన తర్వాత ఓటు వేయడానికి అనుమతించారు. తిరుపతి మినహా మిగిలిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో 50 శాతం ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. తిరుపతిలో 480, రేణిగుంటలో 432, శ్రీకాళహస్తిలో 90, వెంకటగిరిలో 144, పాకాలలో 258 ఓట్లు పోలైనట్లు వెల్లడించారు. పోలింగ్ ముగిసిన తర్వాత బాక్సులను రేణిగుంట ఇన్‌స్టిట్యూట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌కు రైల్వే భద్రతా సిబ్బంది చేర్చారు. తిరుపతిలో యూనియన్ నాయకులు సుదర్శన్ రాజు, రాధయ్య, నారాయణ స్వామి, జి.రోహిణి, గౌస్‌బాషా, శేఖర్‌రెడ్డి, ఎంప్లా యీస్ సంఘ్ నాయకులు కిషోర్, ఆనంద బాబు, రహంతుల్లా, కెఎస్ రెడ్డి, రేణిగుంటలో వేదమూర్తి, శ్రీనివాసరావు, కేసీ కుమార్, జి.సురేష్ కుమార్, బీఎం బాషా, జి.నరేష్, అనిత, భారతి, హైమావతి, ఏఆర్ సిన్హా, సమివుద్దీన్, దీపక్ కుమార్, గౌస్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



రేణిగుంట పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఉద్యోగులు

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సదుపాయాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో వసతుల కల్పన, రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. రోగులకు తాగునీటి వసతి, ఆక్సిజన్ సరఫరా, జనరేటర్, అదనపు గదులు వంటి సదుపాయాల కొరత లేకుండా అందించాలని తెలిపారు.

పంచమి తీర్థానికి అదనపు బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పంచమి తీర్థానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ 40 అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. సెంట్రల్ బస్టేషన్ నుంచి ఉదయం 5 గంటల నుంచి ప్రతి 5 నిమిషాలకు ఓ బస్సు నడపనున్నట్లు మంగళం డిపో మేనజర్ భాస్కర్ కోరారు.

నేతన్నకు ఉచిత విద్యుత్‌పై హర్షం

తిరుపతి అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికలకు ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చినందుకు జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సుంకర చిన్నరెడ్డిబాబు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. హామీని అమలుపరచి నేతన్నలకు అండగా ఉంటామని భరోసా కల్పించారని సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు ఇండోర్ స్టేడియం ప్రారంభం

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఇందిరా మైదానంలో స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన మల్టీ స్పోర్ట్స్ స్టేడియాన్ని గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య పాల్గొననున్నారు.

సూర్య, చంద్రులే వాహనాలుగా..







సకల జీవుల ప్రాణప్రదాతలు సూర్య, చంద్రులు. ఒకరు భగభగ మండి భయపెట్టినా, మరొకరు చల్లని వెన్నెలతో సేదదీరుస్తారు. ఈ ఇద్దరూ తిరుచానూరు పద్మావతమ్మకి వాహనాలుగా మారారు.
కార్తీక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై గోవర్ధనగిరిధారియైన శ్రీకృష్ణుని అలంకారంలో అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి చంద్రప్రభపై భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 12 కళాబృందాలు 257 మంది కళాకారులు వాహనసేవల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

నేటితో ముగియనున్న వాహనసేవలు



నవంబరు 28న చిన్నశేషవాహనంతో మొదలైన వాహనసేవలు గురువారం రాత్రి అశ్వ వాహనసేవతో ముగుస్తాయి. తొమ్మిది రోజుల్లో 16 వాహనాలపై అమ్మవారు ఊరేగి భక్తులను కటాక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు: రథోత్సవం
సాయంత్రం 6 గంటలకు: ఊంజల్ సేవ
రాత్రి 7 గంటలకు: అశ్వవాహనం



గల్లంతైన షారూక్ మృతదేహం లభ్యం



చిట్టమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం మల్లాం రొయ్యల కాలువ సమీపంలోని చప్టా వద్ద వరద ప్రవాహంలో గల్లంతైన షారూక్(23) మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. మంగళవారం ఉదయం ఇద్దరు గల్లంతు కాగా.. మధుసూదన్‌రెడ్డి మృతదేహం లభించింది. బుధవారం తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్‌ఐ చిన్న బలరామయ్యలు సంఘటన స్థలానికి చేరుకొని షారూక్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మత్స్యకారులు లోతైన ఈ గుంతలో వలలు వేసి గాలించగా షారూక్ మృతదేహం బయటపడింది. షారూక్ పనిచేసే చికెన్ షాపు యజమాని షేక్ జలీల్ అహ్మద్ చొరవతో అతడి మృతదేహాన్ని జార్ఖండ్ రాష్ట్రం రాహ గ్రామానికి అంబులెన్స్‌లో పంపారు.

పిడుగుపడి వలస కూలీ మృతి



వెంకటేశ్వరమ్మ (ఫైల్‌ఫొటో)

డక్కిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం శ్రీపురం గ్రామంలో బుధవారం పిడుగు పడి వలస కూలీ మృతి చెందారు.గుంటూరు జిల్లా నిజాంపట్టు మండలం అడువుల దీవి గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ (30) వారం కిందట భర్త వెంకటేశ్వరరావుతో కలిసి వరినాట్లు వేసేందుకు గ్రామానికి వచ్చారు. బుధవారం పొలాల్లో వరినాట్లు వేస్తుండగా ఆమెపై పిడుగు పడడంతో కుప్పకూలారు. వెంటనే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమెకు భర్త, ఐదేళ్ల బాబు, ఆరేళ్ల పాప ఉన్నారు.

పూర్వ చిత్తూరు డీఎంహెచ్‌వోపై విజిలెన్సు విచారణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పూర్వ చిత్తూరు, ప్రస్తుత తిరుపతి డీఎంహెచ్‌వో శ్రీహరిపై విజిలెన్సు విచారణ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వోగా చేపట్టిన నియామకాలు, ఇతర అక్రమాలకు పాల్పడ్డారంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటికే పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నాయి. 2020 నుంచి 2023 వరకు దాదాపు నాలుగు సార్లు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డాక్టర్లు, ఆఫీసు సబార్డినేట్ పోస్టులు భర్తీ చేసిన విషయం విదితమే. ఇందులో అనర్హులకు పెద్దపీట వేసినట్లు విజిలెన్సు విచారణలో తేలినట్లు సమాచారం. ఇటీవల గుంటూరు డీఎంహెచ్‌వో విచారణ అధికారిగా వచ్చి పలు రికార్డులు సీజ్ చేసుకుని వెళ్లారు. ఇక, నిధుల దుర్వినియోగంపైనా విజిలెన్సు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వాటిని ఎందుకు డ్రాచేశారు? దేనికి ఖర్చు పెట్టారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

సహాయక చర్యలు చేపట్టాం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాలకు సహాయక చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం మంగళగిరి సచివాలయం నుంచి హోం మంత్రి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తుఫాన్ వల్ల కొన్ని చోట్ల రోడ్లు, కాజ్‌వేలు దెబ్బతిన్నాయని వాటిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. ఓవర్‌ఫ్లో ఉన్న కాజ్‌వేలపై రోడ్లకు రోపులతో బందోబస్తు చేశామన్నారు. అటు వైపు ప్రజలు వెళ్లకుండా వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, పోలీసులను ఏర్పాటు చేశామన్నారు.

అలిపిరి చెక్‌పాయింట్ వద్ద 'కిస్సిక్'

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్ ముందు ఓ యువతి 'పుష్ప2' చిత్రంలోని 'కిస్సిక్' పాటకు డ్యాన్స్ చేసి తన ఇన్‌స్టా పేజ్‌లో పోస్ట్ చేసింది. ఈ చర్య తీవ్ర విమర్శలకు దారి తీసింది. స్వామి నామాల ముందు ఇదేం పని అంటూ భక్తులు ఆగ్రహించారు. దీంతో ఆమె క్షమాపణ చెబుతూ సాయంత్రానికి మరో వీడియోను పోస్ట్ చేసింది.

కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్టు

- వాహనంతో పాటు కత్తి స్వాధీనం



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ వెంకటనారాయణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సహజీవనం చేసిన ప్రియురాలే కిడ్నాప్ చేయించిన ఘటనలో ఆరుగురు నిందితులను తిరుపతి ఈస్ట్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. తిరుపతి నగర డీఎస్పీ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం కలవకుంట పంచాయతీ రేణుకానగర్‌కు చెందిన వడ్డే శ్రీనివాసులు అలియాస్ నాని కొన్నేళ్ల కిందట తిరుపతికి వచ్చారు. పెద్దకాపులేవుట్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని హోం స్టే నడుపుతున్నారు. మూడేళ్ల కిందట భర్త చనిపోవడంతో మదనపల్లెకు చెందిన సోనియాభాను ఉపాధి నిమిత్తం తిరుపతికి వచ్చారు. ఎనిమిది నెలల కిందట శ్రీనివాసులుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. అతడికి వివాహం కానందున ఇద్దరూ కలిసి సహజీవనం చేస్తున్నారు. ఆమె ఇద్దరి పిల్లలనూ తమ వద్దే ఉంచుకున్నారు. నెల కిందట వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకుని మదనపల్లెకు వెళ్లిపోయింది. తరచూ శ్రీనివాసులు ఆమెకు ఫోన్ చేసి తిరుపతికి రావాలని కోరారు. శ్రీనివాసులతో తన బిడ్డలకు ప్రాణహాని ఉంటుందేమోని భావించిన సోనియాభాను.. తమ బంధువైన మదనపల్లెలో పాత కేసుల్లో నిందితుడైన బాబా పక్రుద్దీన్‌ను సంప్రదించింది. కిడ్నాప్ చేసి కాలు, చేయి తీసేయాలని భావించిన పక్రుద్దీన్.. తన స్నేహితులు రియాజ్, మోక్షిత్ రాయల్, సందీప్‌కుమార్, రాజేష్‌తో కలసి గత నెల 28న వాహనంలో హోంస్టే వద్దకు వచ్చారు. శ్రీనివాసులుపై దాడిచేసి, కత్తితో బెదిరించి లాక్కెళ్లారు. ఈ కిడ్నాప్ ఘటనపై మీడియాలో ట్రోలింగ్ రావడంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఈస్ట్ సీఐ రామకృష్ణ, సిబ్బంది వాయల్పాడు పోలీసులను అప్రమత్తం చేశారు. వారు వాహనాల తనిఖీ చేపట్టారు. కిడ్నాపర్లు ఆదమరచి ఉండగా బాధితుడు శ్రీనివాసులు తప్పించుకుని తిరుపతికి చేరుకున్నారు. బాధితుడి సోదరుడు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమకు అందిన సమాచారం మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది కొర్లగుంట జంక్షన్ వద్ద కాపు కాచి అక్కడ వున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి వాహనం, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు.

కొట్టుకుపోయిన భూపతీశ్వర ప్రాజెక్టు అక్విడెక్ట్



సత్యవేడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం టీపీకోట సమీపంలోని భూపతీశ్వర ప్రాజెక్టు కింద నిర్మించిన అక్విడెక్ట్ ఇటీవల వర్షాలకు కొట్టుకు పోయింది. దీంతో 500 ఎకరాల ఆయకట్టుకు ఈ సారి నీరందని పరిస్థితి నెలకొంది. అక్విడెక్ట్ నుంచి వచ్చిన నీటితో చెరువులు నిండితేనే పంటలు పండేవి. అక్విడెక్ట్ కుప్పకూలడంతో బీరకుప్పం, కడివేడు చెరువులకు రావాల్సిన నీరు రాళ్లవాగు మీదుగా సముద్రంలో కలిసిపోతోంది. ఆక్రమణదారుల వల్లే అక్విడెక్ట్ కూలిందని రైతులు ఆరోపించారు. గతేడాది చెన్నైకు చెందిన వ్యక్తి ప్రాజెక్టు దిగువన భూములను కొని చెంగాల్వను ఆక్రమించారు. స్థానిక వైసీపీ నాయకుడి సహకారంతో ప్రాజెక్టు నుంచి వచ్చే నీటి ప్రవాహానికి భూములు ముంపునకు గురి కాకుండా ప్రాజెక్టు రెండో తూము వద్ద ఎక్స్‌కవేటర్లతో లోతుగా కాలువ తీసి ప్రవాహ దిశను అక్విడెక్ట్ వైపు మళ్లించారు. దీంతో ప్రవాహ వేగం పెరిగి అక్విడక్ట్ కింద భాగం కోతకు గురై కొట్టుకు పోయిందని రైతులు చెబుతున్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. భూ సమస్యల పరిష్కారం కోసం వీటిని వినియోగించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై విజయవాడ నుంచి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇతర అధికారులు బుధవారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామాన్నీ సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22ఏకు సంబంధించిన భూ ఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారి నుంచి ముందస్తు సమాచారంతో వినతులు స్వీకరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 50 శాతం రెవెన్యూ సమస్యలు ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని 1,051 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించాల్సి ఉంటుందని, జేసీ సమన్వయకర్తగా ఉంటారని, ఆర్డీవోలు తమ పరిధిలోని మండలాల్లో సదస్సులను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్డీసీ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మాదిగల అభివృద్ధి

- మందకృష్ణపై విమర్శలు చేస్తే సహించం
- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

తిరుపతి(లీలామహల్), డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడితోనే మాదిగలు అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తెలిపారు. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేస్తున్న ఆయన పట్ల మాదిగలు అత్యంత విశ్వాసంతో ఉన్నారన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయం మేరకు రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీలు సమానత్వంతో రిజర్వేషన్లు పొందాలని 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారేగానీ మాలలకు వ్యతిరేకం కాదన్నారు. కొందరు రాజకీయ లబ్ధికోసం మాల సోదరులను తప్పుదోవ పట్టిస్తూ మందకృష్ణ మాదిగపై విమర్శలు చేస్తే సహించమన్నారు. ఆ మాటలను వెనక్కు తీసుకోవాలన్నారు. బీసీల్లో ఉన్న వర్గీకరణ ఎస్సీల్లో ఉంటే తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. ఆగస్టు1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి రాజ్యాంగ బద్ధంగా మాలమాదిగలు కలిసి సమానత్వం కోసం కలిసిరావాలన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వర్గీకరణ ఆగదని, మీకు అన్యాయం జరిగినా మందకృష్ణ మాదిగ అండగా ఉంటారనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, ప్రభుత్వం స్పందించి వర్గీకరణ పూర్తి చేసి నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌మాదిగ, ఎంఎస్పీ నాయకులు నరేంద్రమాదిగ, రామకృష్ణ, గోపి, రాజేంద్ర, వాసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.90కోట్లు



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ద్వారా రూ.1,90,5,265 వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. గత నెల 6 నుంచి ప్రధాన, పరివార దేవతల వద్ద హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించామన్నారు. ఇందులో ఇంకా 106 గ్రాముల బంగారు, 466.100 కిలోల వెండి, 121 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు.

'వాహన్'లోనే ఆర్టీఏ సేవలు

తిరుపతి (రవాణా),డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఇకపై రవాణా శాఖ సేవల కోసం 'వాహన్' సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే వాడాలని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ బుధవారం తెలిపారు. 'ఈ ప్రగతి' సాఫ్ట్‌వేర్ ఇక అందుబాటులో ఉండదన్నారు. వాహన రిజిస్ట్రేషన్‌కు 'వాహన్‌డాట్‌పరివాహన్‌డాట్‌జీవోవీడాట్‌ఇన్, లైసెన్సు సేవల కోసం 'సారథిడాట్‌పరివాహన్‌డాట్‌జీవోవీడాట్‌ఇన్'లో లాగిన్ కావాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 62 కేంద్రాల్లో 12 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. తిరుపతిలోని ఆర్సీ రెడ్డి, గాయత్రి కాలేజీలను ఇన్‌చార్జి వీసీ అప్పారావు తనిఖీ చేశారు.

8న 'రన్ ఫర్ తిరుపతి'



'రన్ ఫర్ తిరుపతి' కార్యక్రమాన్ని ఈనెల 8న నిర్వహించనున్నారు. శాప్, ఈగల్, ఎస్ఎస్ఎస్ సంయుక్తంగా చేపట్టే ఈ కార్యక్రమానికి బుధవారం ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు బ్రోచర్లను విడుదల చేశారు. 10 కిలోమీటర్ల పరుగు పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.60 వేల విలువ చేసే నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఎస్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రాఘవీణ పాల్గొన్నారు.

అవినీతిపై ఫిర్యాదు చేయాలా?

- 94404 46130 నెంబరుకు కాల్ చేయండి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వెళుతున్నారా? మిమ్మల్ని ఎవరైనా డబ్బులు అడిగితే 94404 46130 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో అవినీతి అధికారుల భరతం పట్టడానికి సామాన్యులు ముందుకు రావాలని ఏసీబీ అధికారులు కోరుతున్నారు. దీనికోసం త్వరలో అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. ఇక, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించింది. రూ.3.32 కోట్లు ఆదాయం లభించినట్టు బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 60,301 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 20,222 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి: పాశిం



విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో పేదల నివాస గృహాలపై నుంచి విద్యుత్‌తీగలు వెళుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ లైన్లు ఇళ్లపై నుంచి వెళ్లకుండా మార్చాలన్నారు. ప్రస్తుతం వరిసాగు చేపడుతున్న రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల కొరత లేకుండా చూడడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

శ్రీవారి సేవలో ఇస్రో బృందం
పీఎస్ఎల్వీ సీ 59 నమూనాకు ప్రత్యేక పూజలు



ఆలయం ముందు ఇస్రో బృందం

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఇస్రో అధికారుల బృందం బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. శ్రీహరికోట షార్‌లో ప్రతి ప్రయోగానికీ ముందు ఇస్రో అధికారుల బృందం నమూనాతో తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పీఎస్ఎల్వీ సీ 59 నమూనాతో అధికారుల బృందం బుధవారం వేకువజామున సుప్రభాత సేవలో స్వామి పాదాల వద్ద నమూనాను ఉంచి ప్రత్యేక పూజలు చేయించి, శ్రీవారిని దర్శించుకుంది. బృందంలో ఎన్ఎస్ఐఎల్ చైర్మన్, ఎండీ డాక్టర్ రాధాకృష్ణన్, డిప్యూటీ సెక్రటరీ పద్మజ్యోతి, సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ యశోద, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస గుప్తా ఉన్నారు. అలాగే సూళ్లూరు పేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ పీఎస్ఎల్వీసీ 59 రాకెట్ విజయవంతం కావాలని పూజలు చేశారు. కార్యక్రమంలో షార్ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ, దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రమాణాలు పాటించని హోటళ్లపై చర్యలు



ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన మాంసాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హోటళ్ల, రెస్టారెంట్లలో బుధవారం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య శాఖ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. లియో రెస్టారెంట్, శ్రీలక్ష్మి హోటల్, అన్నపూర్ణ హోటల్, కేక్ డట్ కమాండ్, రంజాన్ రెస్టారెంట్, మా రెస్టారెంట్లలో కుళ్లిన ఆహార పదార్థాలు ఫ్రిజ్‌లో నిల్వ చేసినట్టు తేలింది. వంట గదుల్లో అపరిశుభ్ర వాతావరణం కనిపించింది. అంతేకాకుండా ఆహార కల్తీ ఎక్కువగా జరుగుతోందని గుర్తించారు. సదరు యజమానులకు నోటీసులు జారీ చేశారు. మరికొందరికి జరిమానా విధించారు. ఇలాంటి పరిణామాలు పునరావృతమైతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. శ్రీనివాస్ బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునస్వామి, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

షాదిమహల్ పాలకమండలికి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే భానుప్రకాష్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న షాదీమహల్ పాలకమండలి సభ్యులు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాదిమహల్ పాలకమండలి సభ్యులకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాల్ని అందుకున్నారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి, షాదీ మహల్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పాలకమండలి సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ గౌస్, హమీద్ బాషా, ఎదుల్లా హస్సేన్, మహమ్మద్ షఫీ, అఫీజాబాను, రఫీఅహ్మద్, యూనిస్ నజీర్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

మిరప రైతులు జాగ్రత్తలు పాటించాలి

వడమాలపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు మిరప చేనుల్లో నీళ్లు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్ర ఉద్యానవన శాస్త్రవేత్త సుధాకర్ సూచించారు. మండలంలోని చింతకాల్వలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మిరపలో మొదలు, వేరు కుళ్లు తెగులు సోకుండా మొక్కల మొదళ్లలో లీటరునీటికి రెడోమిల్ రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేసినట్లయితే పంట త్వరగా కోలుకుంటుందని చెప్పారు. వ్యవసాయాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వేరుశనగ విత్తడం వాయిదా వేయాలన్నారు. విత్తన శుద్ధి కోసం కిలో విత్తనానికి ట్రైకోడెర్మా ఆరుగ్రాముల చొప్పున కలిపి విత్తుకోవాలని చెప్పారు.

దివ్యాంగుల పట్ల వివక్ష వద్దు

సత్యవేడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల సమాజంలో వివక్ష ఉండరాదని, వారిని ప్రోత్సహించడం అందరి బాధ్యత అని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంఈవో రవి అధ్యక్షతన జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైకల్యం ఉన్న వారి హక్కులను ప్రోత్సహించడానికి యేటా డిసెంబరు 3న దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఈవో రవి మాట్లాడుతూ... భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణతో పాటు ఫిజియోథెరపీ అందిస్తామన్నారు. ఎంఈవో ఉష, ఐఈఆర్టీ దివ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

వడమాలపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పాఠశాలకు విద్యార్థిని అదృశ్యమైంది. పాఠశాలకు వెళ్లిన బాలిక సాయంత్రం ఇంటికి చేరకపోవడంతో కుటుంబీకులు తెలిసిన వారి ఇళ్ల, బంధువుల ఇళ్లలో వాకబు చేశారు. ఆచూకీ తెలియకపోవడంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేసి బాలిక కోసం గాలిస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వదలని వాన



సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డులో వర్షపునీరు

నాయుడుపేట టౌన్, పెళ్లకూరు, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, వెంకటగిరి టౌన్, ఓజిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను తీరం దాటినప్పటికీ వానలు వీడలేదు. బుధవారం నాయుడుపేటలో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరపిలేని వర్షం కురిసింది. పట్టణంలో ప్రధాన రహదారులన్నీ జలమయంగా మారాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ● పెళ్లకూరు మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు ఎటువంటి గాలులు లేకుండా వర్షం కురవడంతో వాగులు, వంకలు, స్వర్ణముఖినది ఉధృత్తంగా ప్రవహిస్తున్నాయి. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని అన్ని చెరువులు నిండుకుండల్లా మారాయి. ప్రస్తుత వర్షాలతో చెరువులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ● సూళ్లూరుపేటలో బుధవారం ఉదయం 8నుంచి 11 గంటల వరకు రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలయమంగా మారాయి. జీఎన్‌టీ రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఇటీవల కురిసిన వర్షం ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు రావడంతో నిండుకుండను తలిపిస్తున్న పులికాట్ సరస్సులో అలలు సముద్రాన్ని తలిపిస్తున్నాయి. నెర్రికాలువ, పుచ్చాకాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఫెంగల్ తుఫాన్ ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటుండగా మళ్లీ వర్షం రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ● దొరవారిసత్రం మండలాన్ని బుధవారం వర్షం ముంచెత్తింది. ఉదయం 9 గంటలకు మొదలైన వర్షం మధ్యాహ్నం 3గంటల వరకు విడవకుండా కురిసింది. కాళంగి నదితో పాటు, ప్రధానమైన నెర్రికాలువ, పాలకాలువ,



దొరవారిసత్రం: ఉధృతంగా ప్రవహిస్తున్న నెర్రికాలువ



నాయుడుపేటలో చెరువులా మారిన చిన్నదర్గా వీధి

కన్నాకాలువ, పుచ్చకాలువలు వరద నీటి ప్రవాహంతో ఉధృతంగా సాగుతున్నాయి. వర్షాలు ఎక్కువైతే మండలంలో పలు చెరువుల కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ● వెంకటగిరి మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. అన్ని కాలువలు, చెరువుల్లో నీరు చేరింది. మరో రెండు రోజులు పాటు వర్షం కురిస్తే చెరువులు పూర్తిగా నిండి వ్యవసాయానికి సాగునీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ● ఓజిలిలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లులతో కూడిన వర్షం పడింది. దీంతో వీధులన్నీ బురదమయంగా మారాయి. ఎల్ది పైర్లకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: డ్వామా పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడుతామని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, పనులను వేగవంతంగా నిర్వహించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా విధులు నిర్వహించడంలేదని ఫిర్యాదులుఅందుతున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి విధుల్లో అలసత్వం వహించేవారిపై చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

దొరవారిసత్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ముగిసిన వెంటనే గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన దొరవారిసత్రం మండల కార్యాలయ సమావేశ మందిరంలో సూళ్లూరుపేట నియోజవర్గంలోని ఆరు మండలాల ఉపాధి ఏపీవోలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉపాధి పనులు మందకోడిగా సాగుతున్నాయన్నారు. నియోజకవర్గానికి మంజూరు చేసిన 75 గోకులాల షెడ్లను వెంటనే నిర్మింపజేయాలని సూచించారు. అలాగే సిమెంటు రోడ్ల పనులు పూర్తి చేయించాలన్నారు. ఉపాధి పనుల్లో జిల్లాలో నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉండేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏపీడీ వరప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికుల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆర్టీసీ స్టాఫ్ అండ్‌వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్ల సమస్యలను పరిష్కరించడంలో డిపో మేనేజర్ కొన్ని యూనియన్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, కొన్ని యూనియన్‌లకు చెందిన కార్మికులను సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఉన్నతాధికారులు విచారణ నిర్వహించిన అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున, రాము, శ్రీధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంగా పోలమ్మ

బాలాయపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి మండల వెలుగు కార్యాలయం నూతన ఏపీఎంగా పోలమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండున్నరేళ్లుగా ఏపీఎం లేకపోవడంతో ఇన్‌చార్జిల పాలన కొనసాగింది. ఈ క్రమంలో వాకాడు మండలంలో పనిచేస్తున్న ఏపీఎం పోలమ్మను బాలాయపల్లికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

టీడీపీ నేతకు మాతృవియోగం



సీసీ నాయుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

బాలాయపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) మండంలోని వెంగమాంబపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత, ఏఎంసీ మాజీ చైర్మన్ సీసీ నాయుడు మాతృమూర్తి చెన్నమనేని పార్వతమ్మ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెంగమాంబపురంలో పార్వతమ్మ భౌతికాయానికి నివాళులర్పించారు. సీసీ నాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రాయి మస్తాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై సర్వే

కోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి, లక్ష్మక్క కండ్రిగ గ్రామాల్లో బుధవారం క్యాన్సర్‌పై సర్వే జరిగింది. ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ఆశా వర్కర్ వెంకటరవణమ్మ ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరిగి సర్వే చేపట్టారు.

దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలి

చిల్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అధైర్యపడకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని ఎంపీడీవో గోపి అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక తర్ఫీదు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సనత్‌కుమార్, రహూఫ్, ట్రస్ట్ సభ్యులు బాబు, ఉపాధ్యాయులు నాగరాజు, లలిత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో గోపి

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఓజిలి, పెళ్లకూరు, తడ, బాలాయపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 6నుంచి వచ్చే ఏడాది జనవరి 9వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఓజిలి, పెళ్లకూరు, తడ, బాలాయపల్లి మండలాల తహసీల్దార్లు పద్మావతి, ద్వారకానాథ్‌రెడ్డి, శరత్‌బాబు, శ్రీనివాసులు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విషగుళికలు తిని యువకుడి మృతి



మృతి చెందిన సురేష్

పెళ్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోసనూరు గిరిజన కాలనీకి చెందిన కదూరు సురేష్(17) విషగుళికలు తిని చెందాడు. స్థానికుల వివరాల మేరకు... సురేష్ రెండు నెలల క్రితం రోసనూరు గిరిజన కాలనీ నుంచి చెంబేడు గిరిజన కాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం అక్కడే తన సమీప బంధువుతో కలసి మద్యం తాగాడు. మద్యం మత్తులో విషగుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి పెళ్లకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పెళ్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల పరిధిలోని 71వ జాతీయ రహదారిలో వంతెనపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. తిరుపతి స్విమ్స్‌కు చెందిన నలుగురు వైద్యులు కావలిలో జరిగే వివాహనికి కారులో వెళ్తుండగా నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న మరో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక మహిళతో పాటు మరో ముగ్గరికి గాయాల్యయ్యాయి. ఎస్‌ఐ నాగరాజు, అటుగా వెళ్తున్న నాయుడుపేట కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి పరామర్శ

పెళ్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, హరిబాబురెడ్డిలను టీడీపీ నేత తానంకి నానాజీ పరామర్శించారు. ఇటీవల మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్ధన్‌రెడ్డి మృతి చెందారు. బుధవారం కర్మక్రియలు జరిగాయి. ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

ఎన్‌బీకేఆర్‌లో నేవీ దినోత్సవం



కోట, డిసెంబరు 4: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం భారత నౌకా దినోత్సవం వేడుకలను డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి ప్రారంభించారు. నావెల్ యూనిట్ ఇన్‌చార్జ్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతు నిర్వహించారు.

విద్యార్థులకు ఎన్ఏఎస్ పరీక్షలు

నాయుడుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలో 3, 9 తరగతుల విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) టెస్టులను బుధవారం నిర్వహించారు. నాయుడుపేటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, గురుకుల ఉన్నత పాఠశాల, పుదూరు జడ్పీ ఉన్నత పాఠశాల, రాజగోపాల పురంలోని ఎంపీపీఎస్, జనరల్ పాఠశాల, నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాల, సెయింట్ మేరీస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల, జాక్‌అండ్‌జిల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఏఎస్‌వో సారథి, ఏవో గోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ ఏఎంవో, ఎంఈఈ మునిరత్నం పరీక్షలను పర్యవేక్షించారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గిరిజన గురుకులం, కోటలోని బీసీ గురుకులం, విద్యానగర్‌లోని బాలభారతి, కోటలోని ప్రగతి, శ్రీచైతన్య పాఠశాలల్లోని 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 180మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎంఈవో మస్తానయ్య పరీక్షలను పర్యవేక్షించారు.

వర్షంలోనూ తప్పని ట్రాఫిక్ సమస్యలు



గాంధీ మందిరం పార్కు వీధిలో ఆగిపోయిన వాహనాలు

నాయుడుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ నాయుడుపేటలో ట్రాఫిక్ సమస్యలు తప్పడంలేదు. బుధవారం పట్టణంలోని గాంధీ మందిరం పార్కు వీధిలో వాహనాల రాకపోకలతో రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్య నెలకొంది. ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు వర్షానికి తడుస్తూ ఇబ్బందులకు గురయ్యారు.

ఉద్యాన పంటల్లో నీరు నిల్వ లేకుండా చూడండి

దొరవారిసత్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయి తెలిపారు. బుధవారం ఉచ్చూరు, తనియాలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉచ్చూరులో ఉద్యానవన పంటలు సాగుచేసిన రైతులకు పలు సూచనలు చేశారు. మిరప, కూరగాయలు, పూలతోటల్లో నీరు లేకుండా చూడాలన్నారు. వేరు కుళ్లు, ఎండు తెగులు రాకుండా మొక్కల మొదళ్లల్లో 2 గ్రాముల రిడోమిల్‌ను 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే 13-0-45, 19-19-19 మందును లీటర్ నీటికి 3 గ్రాముల చొప్పున నీటిలో కలుపుకోని పంటలపై పిచికారీ చేసుకోవాలన్నారు.

ప్రశాంతంగా రైల్వే యూనియన్ ఎన్నికలు

గూడూరు, తడ, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): గూడూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ప్రధానంగా సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ మధ్య పోటీ నెలకొంది. బుధ, గురువారాల్లో రెండురోజుల పాటు ఎన్నికలు జరగనున్నాయి. గూడూరు రైల్వేస్టేషన్‌లో ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ● అదేవిధంగా సూళ్లూరుపేట, నాయుడుపేటలో రైల్వే యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8గంటలకు మొదలైన పోలింగ్ సాయింత్రం 6 గంటల వరకు కొనసాగింది. సూళ్లూరుపేట పోలింగ్ కేంద్రంలో 197మంది, నాయుడుపేటలో 154 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాన చేస్తున్న విద్యార్థులు

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రక్తదానం సామాజిక బాధ్యత అని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఏరియా ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, విజయమహేష్, డాక్టర్ పీరకుమార్, ఝాన్సీ, హిమబిందు, వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

దొరవారిసత్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలో జాతీయ రహదారి వంతెనపై బుధవారం తెల్లవారుజామున నాయుడుపేట నుంచి సూళ్లూరుపేట వైపు వెళ్తున్న మినీ వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంకు స్వల్ప గాయాలయ్యాయి. అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు.

పంటల బీమా పథకంపై అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ గోపినాయక్

గూడూరు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటుపాళెం గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాశాఖ ఏడీ గోపినాయక్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి, వేరుశనగ పంటలకు పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాసులు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

వెంకటగిరిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో సుజాత అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లివేడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల బీమా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామమోహన్, రాజ్యలక్ష్మి, భాస్కర్, వేణు, రైతులు పాల్గొన్నారు.

వైష్ణవ కోనేరు వద్ద నోపార్కింగ్



నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసిన పోలీసులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైష్ణవ కోనేరు వద్ద పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. కోనేరు చుట్టూ పెద్దఎత్తున వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో పలువురు స్థానికులు కొద్దిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి స్పందించి ట్రాఫిక్ సిబ్బందితో వైష్ణవ కోనేరు పరిసరాలను పరిశీలించారు. అనంతరం పుష్కరిణి చుట్టూ వాహనాలు నిలపకుండా బుధవారం నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వార్తాకథనం ప్రసారంపై టీడీపీ ఫిర్యాదు


సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ చానల్‌లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌పై అసత్య ఆరోపణలతో కథనం ప్రసారం చేయడాన్ని నిరసిస్తూ టీడీపీ నాయకులు శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ పాలనతో శ్రీకాళహస్తిలో వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయన్నారు. నిరంతరం అభివృద్ధే ధ్యేయంగా దెబ్బతిన్న వ్యవస్థలను ప్రక్షాళన చేస్తున్న ఎమ్మెల్యేపై ఓ చానల్ నిరాధారమైన కథనాన్ని ప్రసారం చేయడం దుర్మార్గమన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలను ఆ చానల్ ఎందుకు వెలుగులోకి తేలేదని ప్రశ్నించారు. అనంతరం 1టౌన్ సీఐకి యూట్యూబ్ ఛానల్ యాజమాన్యంపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సీఐ గోపిని వివరణ కోరగా ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వారి ఆదేశాల అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య, నాయకులు గోపి, మునిరాజా, జయప్రకాష్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీల సభ్యత్వ నమోదులో శ్రీకాళహస్తి అగ్రస్థానం

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న కోలా ఆనంద్, ఉమ తదితరులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ క్రియాశీల సభ్యత్వ నమోదులో శ్రీకాళహస్తి నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ చెప్పారు. తిరుపతి నగరంలో జరిగిన జిల్లాస్థాయి బీజేపీ కార్యశాల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రాథమిక సభ్యత్వాలు గతంలో 25వేలు కాగా ప్రస్తుతం 50,550 చేసి రాష్ట్రంలో మూడో స్థానంలో ఉన్నామన్నారు. అదే విధంగా క్రియాశీల సభ్యత్వాల నమోదులో రాష్ట్రస్థాయిలోనే అగ్రస్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, నాయకులు కండ్రిగ ఉమ, మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, బీడీ బాలాజీ, గోపాల్, యతీంద్రరెడ్డి, నాగరాజు, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో భేటీ అయిన మాజీ ఎమ్మెల్యేలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు, సత్రవాడ మునిరామయ్య అమరావతిలో బుధవారం భేటీ అయ్యారు. టీడీపీ సభ్యత్వాల నమోదు, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ కోసం పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని కోరారు. టీడీపీ యువనాయుడు సత్రవాడ ప్రవీణ్ ఉన్నారు.

పొలంలో రైతుల మధ్య ఘర్షణ: ఒకరికి గాయాలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పొలంలో రైతుల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ జరిగింది. మండలంలోని రాచగున్నేరిలో బుధవారం సాయంత్రం జరిగింది. బాధితుడు బాబునాయుడు తెలిపిన వివరాలు... తన పొలంలో అడుసు దున్నకం చేస్తుండగా ఎగువన ఉన్న పొలం వారు నీటిని వదిలారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఎగువపొలానికి సంబంధించిన నలుగురు తనపై కత్తితో దాడి చేయడంతో తొడపై గాయమైనట్లు తెలిపాడు. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

రేణిగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన రంజన్‌ప్రసాద్(33) స్థానికంగా ఓ పరిశ్రమంలో కార్మికుడు. అతనికి భార్యతో తలెత్తిన వివాదంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసైన అతను నిత్యం భార్యకు ఫోన్ చేసి కాపురానికి రమ్మని పిలుస్తున్నా అందుకు ఆమె అంగీకరించ లేదు. దీంతో ఫోన్లోనే తరచూ ఇద్దరి మధ్య వాగ్వాదాలు జరిగేవి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి అధిక మొత్తంలో మద్యం తాగిన రంజన్ అద్దెకు ఉంటున్న ఇంటిలోనే ఉరివేసుకున్నాడు. గుర్తించిన చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

రాకెట్ ప్రయోగం విజయవంతానికి పూజలు


దర్శనానంతరం ధ్వజ స్తంభం వద్ద షార్ అధికారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలో ప్రవేశపెట్టనున్న పీఎస్ఎల్వీ - సీ59 ప్రోబా-3 రాకెట్ విజయవంతం కావాలని షార్ అధికారులు యశోద, ఎంఎస్ గుప్తా ముక్కంటికి పూజలు చేశారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే స్వామిఅమ్మవార్లను రాజ్యసభ సభ్యుడు సతీష్‌చంద్ర మిశ్రా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ప్రశాంతంగా రైల్వే యూనియన్ ఎన్నికలు


రైల్వే ఇనిస్టిట్యూట్ వద్ద...

రేణిగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైల్వే ట్రేడ్ యూనియన్‌కు జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా రేణిగుంట ఇనిస్టిట్యూట్, సీఆర్ఎస్‌లో బుధవారం పోలింగ్ జరిగింది. రైల్వే కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోలింగ్‌లో తొలి రోజు 50శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. తొలిసారిగా ఐదు యూనియన్లు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో కేంద్రాల వద్ద సందడి వాతావరణం కనిపించింది.

పాలమంగళం కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టండి



నారాయణవనం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా పడిన వర్షాలతో మండలంలోని పలు కాజ్‌వేలపై నీరు ఉధృతంగా పారుతోంది. పాలమంగళం ఉత్తరం కాజ్‌వేపై ఇప్పటికీ నీరు పారుతోంది. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు నిచ్చెన సాయంతో రాకపోకలకు సాగిస్తున్నారరు. వర్షం వస్తే గ్రామానికి దారి లేకుండా పోతోందని దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. అలాగే తుంబూరు వద్ద ఉన్న కాజ్‌వే కొట్టుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు పరిష్కరించాల్సి ఉంది.

అధికారులకు సన్మానం

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం బీపీసీఎల్, హెచ్‌పీఎల్ పైప్‌లైన్ ప్రాజెక్టు లీడరు, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధికారి అభయ్ కాంబ్లే, హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ నారాయణరావు దర్శించుకున్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించారు.

నీట మునిగిన పంటల పరిశీలన

- బీమా వర్తించదన్న వ్యవసాయ అధికారులు
- దిక్కుతోచని స్థితిలో రైతులు


పాత గొల్లకండ్రిగలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

పిచ్చాటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తుపానుతో పంట నష్టాన్ని పరిశీలించడానికి వచ్చిన అధికారులు తెలిపిన వివరాలతో ఊరట కలుగుతుందనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. మండలంలో సుమారు 300 ఎకరాల్లో వేరుశనగ విత్తారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట నీట మునిగింది. పంట పరిశీలించడానికి వచ్చిన అధికారులు బీమా వర్తించదని చేతులెత్తేయడంతో రైతులు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. ఎకరా వేరుశనగ సాగుకు 4 బస్తాల విత్తనాలు అవసరమవుతాయి. బస్తా రూ.4 వేలు చొప్పున కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. ఇక రెండు మూటల రసాయన ఎరువులు, విత్తన శుద్ధి మందులు, కలుపు మందులు, దుక్కులకు మరో రూ.15 వేలు మొత్తంగా సుమారు రూ.35 వేల వరకు ఖర్చు చేసిన రైతుకు పరిహారం రాదని చెప్పడంతో దిగాలు చెందుతున్నారు. మండలంలోని ముడియూరు పంచాయతీ పాత గొల్లకండ్రిగ, కొత్త గొల్లకండ్రిగ, పులియంగుంట, రామాపురంలో పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు యాజమాన్య పద్ధతులు పాటించి నష్ట నివారణ చేపట్టవచ్చని సలహాలు ఇచ్చి వెనుదిరిగారు. శాస్త్రవేత్తలు ప్రతిమ, సరళ, దేవకి, హేమలత, ఏవో సంజీవరెడ్డి, ఏఈవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురం చెరువుకు గండి



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం చెరువుకు గండి పడింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీకాళహస్తి మండలంలో చెరువులు నిండుకుండలా మారాయి. ఈ క్రమంలో బుధవారం వేకువజామున 3గంటల సమయంలో రామాపురం చెరువు కట్ట తెగింది. గ్రామస్తుల సమాచారంతో ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ చెరువు వద్దకు చేరుకుని నీటిని పక్కకు మళ్లించే చర్యలు చేపట్టారు. ఇక రెవెన్యూ అధికారులు సైతం ఘటనా స్థలాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు.


చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ తదితరులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 6నుంచి జరిగే సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో వీర్వోలు, సిబ్బందితో ఆయన మాట్లాడుతూ...ఈ సదస్సుల్లో 22ఏ ప్రభుత్వ భూముల సమస్యలు, ఇతర భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. రిజిస్ట్రేషన్, దేవదాయ, అటవీ శాఖల అధికారులు, సర్వేయర్, ఏఎస్ఓ తదితరులు పాల్గొం టారని తెలిపారు. 6న తెర్రిపాడు, 7న పుత్తేరి, 9న ఆలత్తూరు, 10న భవానీ శంకరపురం, 11న కొత్తపాళెం, 12న టీబీ పురం, సీబీపురం 13న పార్లపల్లి, 16న పల్లమాల, 17న కాటూరు, 18న విజయగోపాలపురం, 19న చిన్నయ్యగుంట, 20న పెద్దపాలేడు, 21న గాజుల పెళ్లూరు, 23న కనమనంబేడు, తంగెళ్లపురం, 24న నీర్పాకోట, 26న కుక్కంబాకం, 27న కంచనపుత్తూరు, 28న వెస్ట్‌వరత్తూరు, 30న నెలవాయి, 31న కుమారవెంకటపురం, జనవరి 2న కల్లివెట్టు, 3నతలారివెట్టుల్లో జరుగుతాయన్నారు.

వరదయ్యపాళెం: మండలంలో ఈనెల 6న శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 6వ తేది కారిపాకం, వితయపాళెం, 7న చెదులపాకం, 9న చిలమత్తూరు, 10న తొండూరు, సిద్ధమ అగ్రహారం, 11న గుడాలివారిపాళెం, నెలటూరు, 12న కడూరు, 13న అరుదూరు, 16న యానాదివెట్టు, 17న రాచెర్ల, కొవ్వూరుపాడు, 18న చిన్నపాండూరు, 19న మోపూరుపల్లి, పాదిరిపాకం, 20న పాండూరు, 21న తొండంబట్టు, 23న కువ్వాకొల్లి, సాతంబేడు, 24న సంతవేలూరు, 26న అంబూరు, మరదవాడ, 27న కళత్తూరు, 28న సీఎల్ఎన్‌పల్లి, 30న కాంబాకం, 31న కురింజలం, అయ్యవారిపాలెం, జనవరి 2న వరదయ్యపాళెంలో సదస్సులు జరుగుతాయన్నారు.

నారాయణవనం: మండలంలోని పాలమంగళంలో 6వ తేది ఉదయం 9 గంటలకు పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు ప్రారంభమవుతుందని తహసీల్దార్ జయరాములు తెలిపారు.

వీడని వర్షం

- నిండిన చెరువులు, పారుతున్న వాగులు, వంకలు


నిండుకుండలా కనమనంబేడు చెరువు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత పది రోజులు నుంచి కురుస్తున్న వర్షాలతో చెరువులు పూర్తి స్థాయిలో నిండి వాగులు, వంకలు పారుతున్నాయి. ప్రతి రోజ వర్షం కురుస్తుడటంతో ఇప్పటికీ వరి నీటిలోనే ఉంది. మిరప, వేరుశనగ పంటల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కాళంగి గేట్లు మూత

- కలుజు ప్రవాహం



కేవీబీపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గడంతో కాళంగి జలాశయ గేట్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో ప్రస్తుతానికి 240 అడుగులకు గాను 220 అడుగల నీరు ఉన్నట్లు తెలిపారు. అలాగే 550 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతున్నట్లు ఏఈ బాబు చెప్పారు. అయితే కలుజు ద్వారా వంద క్యూసెక్కుల నీరు బయటకు పోర్లుతున్నట్లు చెప్పారు.

పూడి మట్టి వంతెన నిర్మాణానికి శ్రమదానం



కేవీబీపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు రాజుల కండ్రిగ వద్ద కొట్టుకుపోయిన విషయం విదితమే. వర్షాలు ఆగినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో పూడి గ్రామాల ప్రజలే శ్రమదానం చేసి సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. కాగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాం నుంచి ఈ వంతెన శాశ్వత నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది.

ఏకలవ్య గురుకులంలో సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

- మెనూ పాటించకపోతే చర్యలు: ఆదిమూలం


విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో మూడు రోజులు నుంచి జరుగుతున్న పరిణమాలపై సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం బుధవారం ఆరా తీశారు. బుధవారం పాఠశాల చేరుకున్న ఆయన సైన్సు ఉపాధ్యాయుడు సుమన్ బదిలీపై ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పథకం ప్రకారమే సైన్సు ఉపాధ్యాయుడిని బదిలీ చేయించారని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. భోజనాలు కూడా నాణ్యత లేకుండా పెడుతున్నారన్నారు. ప్రిన్సిపాల్, వార్డెన్ కారణంగా సమస్యలు ఉత్పన్నమవుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. మెనూ పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఐటీడీఏ పీవోతో మాట్లాడి సైన్సు ఉపాధ్యాయుడి బదిలీని ఆపివేయిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ప్రతి వారం పాఠశాలను తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధునాయుడు, దయనాయుడు,

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

రేణిగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. జ్యోతినగర్ సమీపంలో చర్చిపక్కన ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. తూకివాకం రెవెన్యూ సర్వే నెం.975/7, 1లోనున్న 42 సెంట్ల గుంట పోరంబోకు స్థలాన్ని కూడా కలిపి వెంచర్ వేశారు. ఈ ఆక్రమణలకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఈ అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం సదరు వ్యక్తులకు నోటీసులు కూడా అందించారు. అయినా వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అందులో భాగంగా 42 సెంట్ల భూమి చుట్టూ నిర్మించిన కాంపౌండ్ వాల్, ఆర్చీని ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేశారు. ఇదిలా ఉండగా వైసీపీ హయాంలో ఈ వెంచర్‌కు అప్పటి కార్యదర్శి అనుమతులు ఇవ్వడం గమనార్హం.

సిమెంట్ రోడ్డుపై మట్టి తొలగింపు



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచనపుత్తూరులో వర్షాలకు సిమెంట్ రోడ్లపై పేరుకుపోయిన బురదను సర్పంచు స్వప్న, కార్యదర్శి సుబ్రమణ్యం ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. వర్షాలకు ప్రతి వీధిలో ఉన్న సిమెంట్ రోడ్లలో బురద పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బంది పడేవారు. రోడ్లపై బురదను తొలగించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ

రేణిగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చైతన్యపురంలో కేవీకేలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పెరటికోళ్ల పెంపకంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకురాలు శోభామణి మాట్లాడుతూ... వనరాజా జాతి కోళ్లు ఎక్కువ గుడ్లు పెట్టడంతోపాటు మాంసం కూడా అధిక శాతంలో వస్తుందన్నారు.

జోరువాన



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం జోరువాన కురిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఎడతెరపిలేని వర్షం కురిసింది. ఆ తరువాత సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు మోస్తరు వర్షం కురిసింది. ఉదయం జోరువానలో పట్టణ వీధులన్నీ జనసంచారం లేక బోసిపోయాయి.

పకడ్బందీగా సాగునీటి సంఘ ఎన్నికలు

కేవీబీపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆయకట్టు చెరువుల సాగు నీటి సంఘ ఎన్నికలు సక్రమంగా జరిగే విధంగా చూడాలని ఇరిగేషన్ డీఈ రత్నారెడ్డి చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలకు ఎన్నికలపై శిక్షణ ఇచ్చారు. పోటీ చేసే అభ్యర్థులను నమోదు చేయాలన్నారు. ఎన్నిక తరువాత అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, పోటీ చేసిన వారిన వివరాలు నమోదు చేయాలన్నారు. ఎంపీడీవో రాధారాణి, ఇరిగేషన్ ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోండి


వినతిపత్రం అందిస్తున్న నార్నె వెంకటసుబ్బయ్య తదితరులు

వరదయ్యపాళెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్కి ఆక్రమించిన భూములు, నెల్లూరు జిల్లాలో గుడూరులో రామదూత ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య కోరారు. ఈ మేరకు విజయవాడలో రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగస్వాములు ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్నారని వారి గుట్టు రట్టు చేయాలని కోరారు.

మంత్రి మనోహర్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పీఏసీ చైర్మన్ మనోహర్‌ను బుధవారం విజయవాడలో ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత, చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

విష జ్వరాలపై ఆరా

వరదయ్యపాళెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యానాదివెట్టు పంచాయతీ కోవూరుపాడులో వైద్యాధికారులు బుధవారం పర్యటించారు. విషజ్వరంతో శివయ్య మంగళవారం మృతి చెందాడు. మలేరియా యూనిట్ అధికారి మోహన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి ఇంటి ఆవరణలో పిచ్చిమొక్కలు, కొబ్బరిచిప్పలు, టైర్లు, కుండల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బావి, తాగునీటి ట్యాంకు నీటి నమూనాలను ల్యాబ్‌కు పంపారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీహెచ్‌వో రవీంద్రుడు, సూపర్‌వైజర్ ప్రసన్నకుమారి, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.